

# మనమెప్పుడో...

అట్టాడ అప్పల్నాయుడు

చీకటి తెరలను చింపుతూ, పొద్దు పొడుచుకొస్తున్న వేళ- తీతువుపిట్ట, నా పడక మంచం యెడమవేపు, అల్మారాలోంచి కూత కూసింది. తీతువుపిట్టగదా- పొద్దున్నే యేదో చావు కబురు చెప్తాదేటో?

దెస్ట! తియ్యకు. కుయ్యనీ. పడక మంచమ్మీంచి లేచి, పాచిమొకం తోటి, ఒళ్లు కదలని వయ్యారపు వాకింగుకెళ్తావు గదా? యెళ్లొచ్చీసి, మొకం కడిగీసి, పెళ్లామిచ్చిన టీనీళు తాగుతా, దినపత్రిక తీసి పాడు వోర్తలు చదువుతావు గదా- అప్పుడు తీతువుపిట్ట మళ్లా కూస్తాదిలే. అప్పుడు తీద్దువులే- అనన్నాది మనసు. ఆగి పోయేను. తీతువ గూడా ఆగింది.

కొద్దిసేపు పోయేక, మళ్లీ రెండు కూతలేసింది. లేవబోయేను. మళ్లీ ఆగిపోయింది. బద్ధకంగా, మంచ మ్మీదనే దొర్లేను. తీతువ, మళ్లీ కూయసాగింది.

"...తల దగ్గిరెట్టుకున్నావు. అంత గోల జేస్తంది, యినబడ్లేదా? చెవుడుగాని వొచ్చిందేటి? పెళ్లంగోస యెలగూ యినబడదు. సెల్ గోసా యినబడదా?" మా ఆవిడ, తీతువ అప్పలాగా కేకలేసింది.

తియ్యవోయ్. పొద్దుపొద్దున పెళ్లంతోటి జగడ మెట్టుకోకు. పొద్దల్లా మాడిపోద్ది- అనన్నాది మనసు. సెల్ తీసేను.

అవతల నుంచి చావు వార్తే!

క్షణం క్రితమేనట. టీవీలో స్క్రోలింగవుతోంది చూడమంది.

తర్వాత కీ... కీ... గుర్, గర్... కట్!

ఆందోళనతో- హలో, హలో సెల్‌లోకి చూస్తూ, పలికేను.

"...మీ తమ్ముడు పన్జేసే కంపెనీగాని మూస్సేరా? ఉజ్జోగం ఊడిపోయిందాయేటి?" మా ఆవిడ, నా ఆందోళన గమనించి అడిగింది. ఉదయానేగానీ, రాత్రి నిద్రపోయే ముందుగానీ- మా అక్కో తమ్ముడో, చెల్లెల నుండో, అపుడపుడూ అలాంటి ఫోన్లే వొస్తాయి. ఎవరు చనిపోయేరో చెప్పేను.

"...రామ... రామ..." అంది ఆవిడ.

"...టీవీ యెయ్యి. స్క్రోలింగిస్తన్నట..." అన్నాను.

"... దిక్కుమాలిన కరంటు వుందేటి? పొద్దూరక ముందే- పోనాది. కరెంటు గండలకి రాదు చావు..." గొణిగి, వంటింటికి నడిచింది.

పొద్దున్నే యిలాంటి వార్తలు వింటే- కరెంట్ వాడికే కాదు, పాలవాడికీ, పనిమనిషికీ, పక్క పోర్షన్లో నున్న యింటి ఓనరుకీ, గవర్నమెంటు ఓలు మొత్తానికీ- చావు రాలేదని, రుసరుసలాడ్తుందామె. కళ్లు మూసి, అలా నిస్సత్తువగా కూచున్నాను. కళ్లల్లో- భాస్కర్రావు కదిలేడు. నవ్వుతున్నట్టు, నదిలో ఈత కొడ్తున్నట్టు, నదీ నదాలూ ఎడారులా మన కడ్డంకి- అని నడుస్తున్నట్టు, యే నాటకం లోని డైలాగునో పలుకుతున్నట్టు కళ్లల్లో కదుల్తున్నాడు! అంతేగాని, రోగంతో బాధపడ్తూ, ఆసుపత్రి బెడ్ మీద వున్నట్టు కన్పట్టం లేదు.

అతనికి రోగం అబద్ధం...!

ఔనా, మరి మరణం? మరణవార్త...?

భాస్కర్...! భాస్కర్...!

నర్రెంక సెట్టు కింద- నరుడో భాస్కరుడో...!

ఇంతలో, "చెల్లెమ్మా! బావ లేచేడా? వార్త తెల్సిందా," అని ప్రశ్నిస్తూ నర్సింగరావొచ్చేడు. నర్సింగ

రావూ, నేనూ ఒకే యీడువాళ్లం. నా మీద కాస్త తెలుపూ, యెత్తూ యెక్కువుంటాడు. చాన్నాళ్లు నాటకాల్లో వేషాలు వేసేవాళ్లం. నర్సింగరావు కొడుకు పాత్ర వేస్తే, అతడికి తండ్రో, మామయ్యో వరసయ్యే పాత్ర నేను వేసేవాడ్ని. ఈ చనిపోయిన భాస్కరుడే డైరెక్టర్. పాత్రధారుల ఎంపిక భాస్కరుడిష్టం.

నర్సింగు నా ప్రక్కగా వచ్చి కూచున్నాడు. తలలు వేలాడేసి కూర్చున్నాం. కాసేపయ్యాక వొకరి కళ్లల్లోకి మరొకరం చూసుకుంటే- కళ్లల్లో భాస్కరుడి జ్ఞాపకాల కాల్వలు పారుతున్నాయి.

హైస్కూల్‌లో ఎస్సెస్సెల్సీ ఆఖరి బ్యాచి మాది. భాస్కర్- మా ఎస్పీయల్. ఎస్సెస్సెల్సీ ఆఖరి పరీక్ష రాసేసి, పరీక్ష గదిలోంచి బయటికొస్తూ, భాస్కర్రావు పెన్ను విదిలించేడు. రాఘవరావు మాస్టారి తెల్లలాల్చీ వీపు భాగమ్మీద- భారద్దేశ పటం పడింది. భయం భయంగా మేం వెనక నడుస్తున్నాం. ఎవరో రాఘవ మాస్టార్ని పిలిచేరు. ఆయన వెనుదిరిగితే- మేం కన్పిం చేం. చేతిలో పెన్నుతో- భాస్కర్.

''...భారద్దేశపటమా, ప్రపంచపటమా పడింది?'' ప్రశ్నించేరు మాస్టారు.

''...మేప్ పాయింటు కొశ్చినేదీ యివ్వలేదు మాస్టారూ...'' బుద్ధిగా భాస్కర్.

''కొశ్చిన్ పేపర్లో కాదు నాయినా, నా చొక్కా మీద...?''

తలతిప్పి కిసుక్కున నవ్వుతూ, మావేపు చూసేడు భాస్కర్.

''నే... నే... నేను... కా... కాదు మేస్టారూ...'' భయపడ్తూ చెప్పేను.

''యేదీ, నీ పెన్ను చూపు. కేప్ తీసి దులుపు, పెన్నులో ఇంక్ వుందో లేదో తెలిపోద్ది. దులుపు...?'' అన్నాడు భాస్కర్.

తెలివితక్కువగా, పెన్ను కేప్ తీసి, చెయ్యి జాడించి దులిపేను. ఈసారి సరిగ్గా రాఘవరావు మాస్టారి తెల్లచొక్కా ముందరి వేపు, ఇండియా మేప్ పడింది!

''...మేస్టారూ, ఇండియా మేపు...'' అన్నాడు భాస్కర్.

''...వెధవల్లారా...'' అంటూ బెత్తం వెదకబోయేరు మాస్టారు.

''...నా పెన్నులో యింకే... లేదండీ, కావాలిస్తే చూడండి...'' అని దులిపేడు. సరిగ్గా అప్పుడే, అటు వొస్తోన్న కలిదిండి ఉమారాణి వోణీ మీద వరల్డు మేపు పడింది. ఉమారాణి రాజుల బొట్టె గదా, చేతిలోని కలం పాళీ పీకేసి, గొట్టంలోని యింకునంతట్నీ విసిరేసింది. మనోడి మొఖమ్మీద జిల్లా మేపు వేస్సి, ఆ పిల్ల- పిల్లరాణీ లాగ వెళిపోయింది! అలా, ఆరోజు ఆఖరు పరీక్ష రాసేసి, పెన్నులు ఖాళీజేస్సి, కేరింతలు గొడ్తూ యిళ్లకు చేరేం.

భాస్కర్ దగ్గర- ర్యాలీ సైకిల్ వుండేది. అప్పట్లో, యిన్ని బస్సులూ, ఆటోలూ లేవు. రెండో, మూడో ప్రైవేటు బస్సులుండేవి. రెండు మైళ్ల దూరంలోని హైస్కూలుకి, మేమంతా నడిచే వెళ్లేవాళ్లం తొలినాళ్లలో. భాస్కర్ ర్యాలీ సైకిల్ మీద ఒక్కడే, రయ్యిమని వెళి పోయేవాడు. కొద్దిరోజులకి- నన్ను సైకిలెక్కించుకునే వాడు. మరికొన్ని రోజులకి నర్సింగరావుని! రోజులు గడిచేకొద్దీ, మిత్రబృందం పెరిగిపోయింది. చివరికి, సైకిల్ నిండా మిత్రుల పుస్తకాల సంచీలూ, కేరేజీలు తగిలించి, మిత్రుల్తో కబుర్లాడ్తూ నడిపించుకు వచ్చేవాడు.

భాస్కర్రావు మాకంటే వొక యేడాది పెద్ద. ఒక క్లాస్ మాకు సీనియర్. అయితే, నైన్త్ క్లాస్‌లో వుండగా అతనికి గుండె రక్తనాళాల్లో యేదో ఇబ్బందొచ్చింది. ఆసుపత్రిలో మూడు మాసాలు వుంచేసారు. చావుదప్పి బతికేడు. ఎటెండెన్స్ చాలక ఆ యేడాది నైన్త్‌లో వుంచే శారు. ఎయిత్ పాసై- మేము నైన్త్‌లో క్లాస్‌మేట్సయ్యేం.

''...ఆరోజు, మళ్లీ స్కూలుకొస్తూ, 'నీ రాకకు టైముందింకా. మీ ఫ్రెండ్సు వొప్పుకోరు. అంచేత వుండు, ఆళ్లతో కలిసి, బోల్డు ఘనకార్యాలు చెయ్యాలింకా నువ్వు. ఉండిపో, టైమయిన్నాడు మీమే తీసుకపోతాం అని యముడి దూతలు నన్ను వుంచీసేరు,' అని గదా అన్నాడు! ఇప్పుడు చెయ్యాల్సిన ఘనకార్యలు చేస్నాడని, ఫ్రెండ్సుకి వొక మాటేనా చెప్పకుండా...'' దుఃఖం కమ్ము కుపోగా, నాతోపాటు ఆ పాత జ్ఞాపకాల్నే తడుముకొని, కుమిలిపోతూ పలికేడు నర్సింగ...!

ఇంతలో సెల్ మోగింది.

''...బహుశా బాడీని ఊరు తీసుకెళ్లకపోవచ్చు. అంత్యక్రియలు యిక్కడేలాగుంది. గంటకో, ఘడియకో చిన్నకూతురు వొస్తాదట, ఆమె కోసం చూస్తన్ను. ఔను గదా? మరి ఊరికెందుకు? ఊరిలో యేముందతనికి? ఎవరున్నారతనికి...'' సెల్ ప్రశ్న.

ఏమీ లేవా...?

ఏమియునూ లేవా...? పడతీ... యేమియునూ లేవా...?

నాగావళి నదీ, ఇసుకతిన్నెలు, మామిడితోటలు, ఎలిమెంటరీ స్కూలు గ్రౌండూ, నాయుడోరి గడపలూ, తెలుకలోళ్ల గానుక సాలలు, గొల్లల మేకల మందలు, పశుల సాలలు, ఊరి వీధుల్లో ఆటపాటలూ- యేవీ, అతనివి కావా...? పొట్టకూటికి ఊరు నించి వలసబోతే- యిక వేళ్లు తెగిపోయినట్టేనా...?

'...ఎక్కడ పుట్టాలా? ఎక్కడ చావాలా? ఎప్పుడు పుట్టాలా? ఎప్పుడు చావాలా? అన్నది మన చేతిలో లేదు. బతుకే మన చేతిలో వుంటుంది...' అనేవాడు భాస్కర్.

ఆ బ్రతుకు- నిండుగా, స్వచ్ఛంగా, కళాత్మకంగా, సృజనాత్మకంగా సాగాలనే వాడు. మానవ ప్రాణికి తప్ప మరో ప్రాణికి యిది సాధ్యం కాదు.

ఎందువల్లనో, మానవ ప్రాణికీ అలాంటి బ్రతుకు దూరమవుతోంది. ఏదోలా, బతికేస్తున్నాడు మానవుడని, నిట్టూర్చేవాడు.

ఆరుద్రకార్తె వానలో తడుస్తూ నారుమడి బురద నీటిలో మునగా, తేలా కొట్టుకుంటూ తిరుగాడే, వాన పాములాగా- బ్రతుకు తెగి ముక్కలయినా, మొండెపు ముక్కతో బతుకు సాగించాలి. బతుకుతూ, బతికిం చాలి- అనేవాడు.

అలాగే జీవించేడు. చుట్టూ వున్నవారిలో జీవన చైతన్యాన్ని నింపేవాడు. జనాలకేగాదు, జంతుజాలా లకు జీవచేతనను కలిగించేవాడు. చిలుకలు, నెమళ్లు, కోళ్లు, కుందేళ్లు, కుక్కలు, కోతులు... రకరకాల జీవాలు- అతడి చుట్టూ! వాటి మధ్య తిరుగాడుతూ, యే నాటకంలోని డైలాగునో పలుకుతూ కన్పించేవాడు.

"... సృష్టికర్త గూడా- యిలాగే రకరకాల జీవరాశు ల్ని చేరదీసి, లాలించీ, ఆ జీవులు వొక్కోదానికీ వొక్కో బతుకుమాట నేర్పుతాడేమో గదా...?" అనన్నానోసారి, భాస్కర్‌తో.

"...ఆ 'బతుకుమాట' యేదో, సృష్టికర్త నాకు నేర్పి నట్లులేదు," అని బదులిచ్చేడు, పెదవి విరిచి, విచా రంగా!

అప్పటికి భాస్కర్, బొబ్బిలి మహారాజా కాలేజీలో పి.యు.సి. చేసొచ్చేడు. విజయనగరం, మహారాజా కాలేజీలో డిగ్రీ చేయాలనుకున్నాడు కానీ వరుసగా రెండేళ్ల కరువు, రైతుల్ని కుదేలు జేస్సింది. ఎస్సెస్సీలతో ఆగిపోయిన మాకు- భాస్కర్ తోడయ్యేడు, అప్పుడు.

"...మహారాజా కాలేజీలైతే వున్నాయిగానీ, మన్లా టోళ్లకి చదువు అవకాశం కల్పించే మారాజులు మాత్రం లేరువోయ్. ఇక మన ఊరే మనకి విద్యాలయం, విశ్వ విద్యాలయం..." అన్నాడు. ఊరి గురించి ఆలోచిం చటం, ఊరి నుంచి నేర్చుకోవటం, ఊరికి నేర్పటం- గ్రంథాలయ స్థాపన, యువజన సంఘం, రాత్రి పాఠశాల, నాటకాల ప్రదర్శన, సమాజాన్ని సంస్కరించే భావజాలంతో...

అప్పట్లో విశాఖపట్నంలో ఓర్ హేండ్లింగ్ వర్క్ సబ్ కాంట్రాక్ట్ పొందిన రాజుగారు, భాస్కర్ తండ్రికి మిత్రుడు. కొడుకు వ్యవసాయపు పనుల్లో, శారీరక శ్రమకు తట్టుకోలేకపోతున్నాడనీ, యింకోవేపు, సంఘాలూ, సంస్కరణలూ, నాటకాలూ అంటూ చెడి పోతున్నాడనీ, మిత్రుడితో చెప్పుకుంటే, ఆ మిత్రుడు భాస్కర్‌కి ఉద్యోగమిచ్చేడు.

ఉద్యోగమంటే- ఎలక్ట్రికల్ కేబుల్ బండిల్స్ లాగడం, ఎలక్ట్రీషియన్‌కి, కటింగ్ ప్లేయరూ, వైర్లూ, స్విచ్‌బోర్డులూ, సిగరెట్లూ, టీలూ అందివ్వడం; సాయంత్రం డూటీ దిగిపోయేక, దగ్గరలోని కొబ్బరితోట ఏరియా సారా దుకాణంలో ఎలక్ట్రీషియన్‌కి సీసా, చీకులూ అందివ్వటం, సరదా పుడితే తనూ పుచ్చుకో వడం- యే రాత్రికో కంచరపాలెం మెట్లలోని ఒంటి స్తంభపు డాబా గదికి చేరి నిద్రబోవటం- తెల్లారగానే, మళ్లీ నిన్నటిని కొనసాగించటం...

"ఉండలేకపోయేనోయ్. అదొక ఉజ్జోగమా...?" కష్టమ్మీద నెలరోజులు చేసి వొచ్చేసాడు.

"...ఆ సంవుద్రం, ఆ సల్లటిగాలీ, ఆ మేడలూ, ఆ కార్లూ, ఆ కార్లలోని కళ్లు పట్టని మనుషులూ, ఆ రోడ్లూ, ఆ వీధులూ, సాల్నుం ఆట్ని- సూస్తే కడుపు నిండిపోద్ది. మరేటక్కర్లేదు...!

"అలాటివన్నీ వొదులుకొని యెలాగ వొచ్చీసేవో? యేటో? ఇక్కడేటున్నాయి... సూసుకొని బతకడంకి? పండని బూములూ పనికిరాని మనుసులూ, యీసురో మనే వీదులూ... యివేగదా! కుక్కలూ, పందులూ, పిల్లులూ, పిట్టా పిచ్చికలే గదా- నీ చుట్టూ! ఇవే గదా నీ చుట్టూ...! ఈట్ని జూస్తే, కడుపు నిండతాదా? సీ! ఏమ్మనిసివో...? ఎలాగ బతకతావో...?" అని తండ్రి కోపించినాడో, శోకించినాడో...!

ఆ మాటలు గుర్తుకొచ్చి- "బతుకుమాట భగ వంతుడు నేర్పలేదు నాకు," అనన్నాడు.

ఆసరికి కొద్దినాళ్లే ఊళ్లో వున్నాడు. ఒకటో, రెండో నాటకాలు ప్రదర్శించేం. భాస్కర్‌కి అవీ నచ్చలేదు. అసలు మనకి మంచి నాటకాలు లేవనేవాడు. ఒక

'బొమ్మలాట', ఒక 'జముకుల కథ', ఒక 'జాలరి భాగోతం' లాటివి మన చిన్నతనాన మనల్నీ, మన పెద్దల్నీ కట్టి పడేసేవి. ఇప్పుడు మన కళారూపాలు- అలా ప్రేక్షకుల్ని ఆకర్షించటం లేదనేవోడు. నువ్వే రాయగూడదా, అంటే- తల పంకించి, వూరుకునేవోడు. సడన్‌గా- జాలరి భాగోతం నేరుద్దామన్నాడు. అన్నట్టు గానే, జాలరి భాగోతం ఆటా, పాటా నేర్చుకోడానికి, పార్వతీపురం దగ్గరి 'ఉద్దవోలు' గ్రామం వెళ్లేడు.

భాస్కర్ బాగోతం నేర్చుకుని వొచ్చేసరికి, నేను ఊరొదిలి విశాఖపట్నం వొచ్చేశాను. వ్యవసాయమ్మీద ఆధారపడి బతకలేవు, విశాఖపట్నానికి, ఓర్ హేండ్లింగు ప్లాంటూ, స్టీలు ప్లాంటూ, యింకేవో కర్మాగారాలూ వొస్తున్నాయి, టెక్నికల్ కోర్సులు చెయ్యి, ఉద్యోగాలు దొరుకుతాయని, అప్పారావు పట్నాయక్‌గారు- నన్నూ, నా తండ్రినీ రోజూ సతాయిస్తే ఐటిఐలో చేరేను. నా తర్వాత నర్సింగరావూ విశాఖ వొచ్చేడు. వాళ్ల బంధు వొకాయన, వొక కంపెనీలో వాచ్‌మేన్ నౌకరీ యిప్పించే డతనికి. భాస్కర్ గూడా, విశాఖ వొచ్చేస్తే బాగుణ్ణు అనుకునేవాణ్ణి.

ఆరోజుల్లో, విశాఖ నగరం మా పల్లెటూరి యువ కులకొక ఆశాదీపం. కడుక్కున్న మొహమయితే, యెవరేనా పిలిచేసరికి సిద్ధమవచ్చని- పల్లెల్లో మా పెద్దలనే వారు. చదువులు చదివేసి సిద్ధంగా వుండమనే వారు...! మేము సిద్ధమయేసరికి, రెండేళ్లు గడిచేయి. మూడో యేడాది విశాఖనగరం పిలుపు కోసం యెదురు చూస్తూ, ఊరిలోనే గడిపేం.

అపుడు భాస్కర్- ప్రైవేటుగా డిగ్రీ ఫైనలియర్ చేస్తున్నాడు. ఇంకోప్రక్క యింకొందర్ని కూడగట్టి జాలరి భాగోతం ప్రదర్శనలిస్తున్నాడు.

''... అతగాడిలాగా యేటికి యెదురీదడం, మరొక మానవుడికి సాధ్యపడదు. ఎదురీదీ, జెయించు కొచ్చేడు. అదీ మనోడి గొప్పతనం...'' ఏవేవి జ్ఞప్తి కొచ్చేయో, నర్సింగరావు నా కళ్లల్లోకి చూస్తూ పలికేడు. మళ్లీ అంతలోనే-

''... అన్ని పరిక్షలూ ఆ దేవుడు వొరసగా వొకదాని తర్వాత వొకటి పెట్టేసేడు వోయి మనోడికి!

'ఎగ్జామినేషన్స్ సిలబస్ తెలీకగానీ; లాస్ట్ ఎగ్జా మెపుడో తెలిస్తే, కలం నిండా సిరా నింపుకు, రాసేసొచ్చి- ఆ కలిదిండి ఉమారాణీలాగా, పాళీ పీకేసి, పెన్ను గొట్ట దులిపేద్దును; దేవుడి మొకమ్మీద, మానవలోకం మేప్ యేసేద్దును,' అని నవ్వుతూ, నవ్వించుతుండే వోడు వోయ్...'' అనన్నాడు, దీర్ఘంగా నిట్టూర్చి.

భాస్కర్ ఫైనలియర్ డిగ్రీ అయ్యింది. అనారో గ్యంతో తండ్రి ఆస్పత్రి పాలయ్యేడు. తండ్రికి వైద్యం కోసం, వ్యవసాయ మదుపుల కోసం, ఇంటి ఖర్చుల కోసం- 'డబ్బు' అనే పదార్థమెంత అవసరమో, ఆ పదార్థం మనుషుల్నీ, కుటుంబాల్నీ, సమాజాల్నీ యెంతెంత యిన్‌ఫ్లుయన్స్ చేయగలదో, భాస్కర్‌కి తెలిసొచ్చింది.

''...డబ్బు అనే పదార్థాన్ని యెలాగ సృష్టించడమో, బహుశా ఆ సృష్టికర్తకి గూడా తెలీదువోయ్. ఆ పదార్థాన్ని సంపాదించడంకి దోవలు తెలిస్తే, తెలవొచ్చు. ప్రభాత సేవ నుండి, పవ్వళింపు సేవదాకా- సంపాదనా పాట్లే గదా దేవుడికి! దేవుడే, ఆ పదార్థం కోసరం అన్ని పాట్లు పడితే, మానవుడింకెన్ని పాట్లు పడాలి? అనేవోడు. అలాగే, యెన్ని పాట్లు పడ్డాడో గదా...'' తల వేలాడేసి, నేలచూపులు చూస్తూ, భూమిని ప్రశ్నించినట్లుగా, ప్రశ్నించేడు నర్సింగరావు.

పంటల ఫలసాయం చాలేది కాదు. అప్పులు చేసేవాడు. 'అప్పు వాడిన వాళ్లందరూ- హరిశ్చంద్రులు కాలేరుగానీ, అప్పులిచ్చేవాళ్లందరూ నక్షత్రకులే లాగుం దర్రా', అనేవాడు.

ఏడాదిపాటు రోగంతో తీసి తీసి, అప్పు ఖాతాను పెంచి, తండ్రి చనిపోయేడు. అప్పటికి, నాకు కోర మండల్‌లో ఎలక్ట్రీషియన్ నౌకరి దొరికింది. అంతకు ముందు భాస్కర్ వుండే, కంచరపాలెం మెట్ట దగ్గరి గదిలోనే నేనూ, నర్సింగరావూ వుండేవాళ్లం.

భాస్కర్‌ని పరామర్శించడానికొచ్చినపుడు- ''ఊరొదిలీయాలేమో? నేనూ విశాఖ వొచ్చేయాలేమో? ఆలినీ, బిడ్డనీ, రాజ్యాన్నీ వొదిలీసో? పోగొట్టుకునో? హరిశ్చంద్రుడు వారణాశి వొచ్చినట్టు- నేను విశాఖ పట్నం వొచ్చీయాల! ఆలుబిడ్డలూ, రాజ్జెంవూ లేవు గానీ- పంటబూమినీ, యింటినీ నక్షత్రకుడికి జమజేసి, వొచ్చీ యాలి,'' అనన్నాడు తండ్రి మరణం తర్వాత. కుటుంబ బాధ్యత తనే తీసుకోవాలి గనక, అందుకు సంసిద్ధమై, కావడెత్తుకున్నట్టు కన్పించేడు. తల్లీ, తమ్ముడూ, వొక పెళ్లియీడు చెల్లీ- బరువులు!

''...ఇంటినీ, ఊరినీ వొదిలేసి రావలసినందుకూ, భూమి అప్పుల కింద పోయి నందుకూ, మానవుడేమి బాధపడ్డాడో యేమోగానీ, తన చుట్టూరా తిప్పుకు పెంచిన జీవరాశిని వొదలలేకా, తనతో తీసుకురాలేకా దుఃఖంతో కుమిలిపోయేడు. ఊరికి దూరంగా నున్న అడవికి తీసుకెళ్లి, ఆ జీవాల్ని అడవిలో వొదిలేసొచ్చి-

చాలాసేపు యేడిచేడువోయ్...! తల్చుకుంటే యిప్పుడు దుఃఖమొస్తంది నాకు...?" భాస్కర్ ఊరొదిలినప్పటి ఘటనను చెప్పుకొచ్చేడు నర్సింగ్.

అతను విశాఖపట్నం వొచ్చింతర్వాతే కలిసేం. సీతమ్మధారలో ఇల్లు అద్దెకు తీసుకొన్నాననీ, కుటుంబా న్నంతట్నీ తీసుకొచ్చేసాననీ- కబురు జేస్తే, వెళ్లి కలిసేను.

పచ్చళ్ల వ్యాపారం ఆరంభించేడు.

"...అదేమిటోయ్? విశాఖపట్నానికి కొత్త కొత్త కంపినీలూ, కర్మాగారాలూ వొస్తన్నాయిగదా...?" అనన్నాను.

"అయితే...?" ప్రశ్నించేడు.

"...అవన్నీ, విశాఖపట్నం లాభాల కోసమొస్త న్నాయిగానీ మన బతుకుతెరువు కోసమే రావట్లే దన్నాడు... గదవోయ్..." అని, ఆనాటి మాటల్ని జ్ఞాపకం చేసేడు నర్సింగరావు.

అయినా- వాటిల్లో దేంట్లోనో బతుకుతెరువు వెదకొచ్చుగదా, అనంటే, "చ్చు, అయితే పచ్చళ్ల వ్యాపారం బతుకుతెరువు గాదేటి-' అనడిగేడు...! ఏం చెప్తాం...?

పచ్చళ్ల వ్యాపారంతో పడగలెత్తి, ప్రక్కన చిట్ ఫండూ, సిన్మా బిజినెస్‌లూ జేసి, కష్టించి పని చేయటం, క్రమశిక్షణా, విశ్వసనీయతా అనే గుణగణాలతో, విపణీ గణా నికి 'మార్గదర్శు'లైన వారుండగా- కేవలం, ఆ మూడు గుణగణాలు మాత్రమే, మూలధనమయిన, మావాడు మాత్రం పచ్చడైపోయేడు.

'...వ్యాపారం, నీ తత్వానికి నప్పదన్నాం,' మిత్రు లం! అపుడు- అయితే, భోజనం ముఖ్యమా, విశ్వా సాలు ముఖ్యమా అన్నకాడకి, మనం చేరామన్నమాట. చూద్దాం అన్చెప్పి, మరికొన్నాళ్లదే వ్యాపారాన్ని సాగిం చేడు.

అప్పటికి, ఎమర్జెన్సీ వచ్చి వెళ్లింది. రాజకీయాల్తో కొత్త శక్తులూ, కొత్త సిద్ధాంతాలు వొచ్చేయి. పట్నంలో- కొత్త వ్యాపార సంస్థలు వెలిసేయి. మందుల భీముడు మున్సిపల్ ఛైర్మనూ, గేదెల గంగరాజు కౌన్సిలరూ, భీమసేనారావు ఎమ్మెల్యేగా... యెదిగేరు. చుట్టుప్రక్కల ఊళ్లని ముంచేసుకొని- విశాఖపట్నం నలువేపులా విస్త రించుతోంది.

జాలారి భాగోతం నేర్చుకొచ్చిన భాస్కర్, విశాఖలో మళ్లీ మమ్మల్ని జతజేసి వంగపండు రాసిన భూమి భాగోతం నేర్పి, ప్రదర్శనలు యిప్పించేడు. కొత్త ప్రదర్శనలు వేసాం. ఏదో బాగులేదువోయ్, యిందులో అనేవాడు. అలా అంటూ, ఆలోచిస్తూ- 'రాజకీయాలు చెప్పడానికి భాగోతం వేస్తున్నట్లు లేదూ?' అన్నాడు.

పోలీసులు గూడా- రాజకీయాలు చెప్తున్నారని మా మీద కేసు పెట్టి, అరెస్ట్ చేసారు. సెంట్రల్ జైలులో నెలరోజులున్నాం. ఆ కేసు కోర్టులో కొట్టివేసేసరికి సంవ త్సరం పట్టింది. మిత్రులందరం ఇబ్బందుల్లో పడ్డాం.

"మళ్లీ బోయినం ముఖ్యమా, విశ్వాసాలు ముఖ్యమా అన్న కాడకొచ్చామోయ్," అని నవ్వేడతను.

అదిగో, ఆ తర్వాత మళ్లీ మిత్రులం కొన్నాళ్లు దూరమైనాం. పెళ్లిళ్లూ, పేరంటాలూ, బతుకుపోరులో... ఎవరికి వారమైనాం.

దినపత్రిక వొచ్చినట్టుంది. మా ఆవిడ తెచ్చిస్తే, నరసింగరావు పత్రిక విప్పుతూ-

"...యీ ఉదయం చనిపోతే పేపర్ల యెలాగొచ్చే స్తాదీ...? రాదు, రాదు..." అంటూనేపేజీలు తిప్పసాగేడు.

నాకు 'అతను' విశాఖపట్నం నుంచి, హైద్రా బాద్‌కి మకాం మార్చి వెళ్లబోయే ముందరిరోజు గుర్తు కొస్తోంది.

పచ్చళ్ల వ్యాపారం మానేసేక, కొన్నాళ్లు యెవరో కొత్తగా యేదో కంపెనీ పెడితే- మేనేజర్‌గా చేరేడు. ఆ కంపెనీని కొద్దినాళ్లలోనే యెదిగించేడు. కంపెనీకి యిక అతని అవసరం లేదన్పించింది. మేనేజర్‌గా వున్న రోజుల్లో అప్పు జేసి చెల్లి పెళ్లి చేశాడు. అప్పు సగమైనా తీరలేదు. ఉద్యోగం పోయింది. మూడు వాయిదాలు చెల్లించకపోయే సరికి అప్పు యిచ్చినవాళ్లు కోర్టులో కేసు వేసారు. అరెస్టూ... జైలూ...! ఎవరో బంధువు జామీనుతో విడుదల...!

"...రేపో, ఎల్లుండో, నేను హైదరాబాద్ షిఫ్ట్ అయిపోతానర్రా..." అనన్నాడు.

"వెళ్లీ... అక్కడ మాత్రం యేం చేస్తావోయ్...?"

దుఃఖం మా గొంతుల్నిండా. అప్పటికి మేము నాటకాలు వెయ్యటంలేదు.గానీ, అతను మాత్రం నాటకాలు రాయటమారంభించేడు. కొన్ని నాటకాలు పరిషత్తుల్లో బహుమతుల్ని పొంది, కొన్ని నాటక సంస్థలకు ప్రతిష్ఠ దెచ్చేయి. ఆ సంస్థలవారు కిరాయి రచయితగా- వుండగల్రా అనన్నారట. 'చూడండివోయ్, కిరాయిరౌడీలాగా... కిరాయి రచయితట...' అని నవ్వేడు.

"...హైదరాబాద్‌లో యేం జేస్తావు? యెలా బతుకుతావు?" మళ్లీ దుఃఖపు గొంతులు ప్రశ్నించేయి.

చేతులు చూపేడు. పొడవైన రెండు హస్తాలు...! "ఇవి చాలు. వీటికి తోడు యీ రెండూ..." అంటూ కాళ్లు రెండింటినీ చూపి, "ఇవి ఆడినన్నాళ్లు బతుకు ఆడేస్తాది, భయంలేద,"ని చెప్తూ, "...కష్టాలకు ఓర్చు కోలేనివాడు, సుఖపడే రోజులొచ్చేసరికి బతకడు..." అనన్నాడు.

"...ఛ...! కష్టాలు దాటేసేడు, ఒడ్డెక్కేసేడు. పిల్లలు చేయందుకొచ్చేరు. తమ్ముడూ, చెల్లెలూ బాగు న్నారు. మానవుడికిక పర్లేదనుకుంటే- యిదేటివోయ్? ఛ... దెస్ట్రోయ్, డ్రైం్రఁవోయ్- కేన్సరేటివోయ్? మానవుణ్ని తినేసిందివోయ్..." దాదాపు, మృత్యుదేవత ముఖమ్మీద ఉమ్మెయ్యాలన్నట్లు మొహంబెట్టి, కంఠసించుకున్నాడు నరసింగరావు.

ఫోన్ మోగింది. అతని తమ్ముడి నుండి కాల్-

"...అంత్యక్రియలు యిక్కడ కాదండీ, అక్కడ ఊర్లోనేనండి. పుట్టిన మట్టిలో కలిసిపోవాల యేనాటి కైనా అనీవోడు, కదండీ అన్నయ్యా? మరో గంటా గంట న్నరకి బయల్దేర్తామండి... మీరు నేరుగా ఊరొచ్చీ యండి. మీ మిత్రులందరికీ వీలయితే చెప్పీయండి... నాకు తెల్దండీ, మీరు ముందుగాల వొచ్చి ముందుండీ కార్యం జరిపించాలండీ బాబ్బాబు..." గొంతులో దుఃఖపు నీళ్లు నిండిపోయాయేమో- మరి మాట్లాడలేక పోయేడు.

ఔను... నీకే కాదు, నాకూ తెల్దు. మనందరి ముందరా నిల్చుండి, 'అతను' గదా నడిపేడు.

'...హైద్రాబాద్‌నుండి తీసుకొచ్చినపుడు అతని తమ్ముడు ఫోన్‌జేసి చెప్పేడు. ప్చ్...! రేపెళ్దం, ఎళ్లం డెళ్దం... అనుకునే గడిపీసేను. తీరిక దొరికింది కాదు. ఛ... ఏం బతుకులోయ్? ఇదిగో, యిప్పుడు అతని శవాన్ని చూడాల! నీను రానువోయ్. అతన్ని శవంగా చూడ్లేనోయ్? నీ్రానను. నువ్వెళ్లవోయి..." ముక్కు చీదుకున్నాడు నర్సింగరావు.

ఆస్పత్రిలో వున్నపుడు, నేను గూడా వెంటనే వెళ్ల లేదు. తీరిక దొరికి వెళ్లేసరికి మత్తు ఇంజక్షనిచ్చారట, నిద్రలో వున్నాడు. చిక్కి శల్యమైపోయాడు. రోగపు మూటలా కన్పించేడు, కప్పుకున్న దుప్పటిలా! గ్రామం లో గడిపిన కాలం, చదువులూ, ఆటపాటలూ, నాటకా లాడటాలూ, యువజన సంఘం నడపటం- గ్రామ పెత్తందార్లతో ఘర్షణ- బతుకుతెరువు కొరకు విశాఖ చేరడం, భూమి భాగోతం, పోలీస్ కేసూ, జైలూ, మళ్లీ బతుకు తెరువు వెదుకులాట- వొక జీవితకాలపు నా నీడ నాకు కన్పించింది!

"...అలాగంటే యెలాగోయ్? మిత్రులం మనమే తట్టుకోలేకపోతే- అతని పిల్లలూ, భార్యా, కుటుంబం యెలా తట్టుకుంటారు?

"మనమే ధైర్యం చెప్పాల. ఆఁ పద, పదా. మన ఊరిలోనే అంత్యక్రియలని, అతని తమ్ముడి ఫోను. పద, గోవిందరావుకీ, సత్తిరాజుకీ చెప్పొద్దాం..." అని లేవ దీసేను నర్సింగరావుని.

*

ఉదయపు ఎండ యింకా యెక్కలేదు. ఆకాశం సంతాపసూచకంగా మబ్బులు నింపుకు నిల్చుంది. రోడ్ల మీద పాలవేన్లూ, కాన్వెంటు బస్సులూ, కంపెనీల జీపులూ, కంకరా, మట్టీ, యిసుకా లోడ్లతో లారీలూ- నిద్ర యెరుగని జీవాల్లా, రాత్రి నుంచీ బర్రుబర్రున తిరుగుతున్నాయి.

గోవిందరావు- కింగ్‌లూ, జార్జ్‌లూ యీ దేశాన్ని పాలించారని గుర్తుజేసే- కింగ్‌జార్జి హాస్పిటల్‌లో పేథాల జిస్ట్.

మేము వెళ్లేసరికి స్కూటర్ తీస్తూ కన్పించేడు.

"అక్కడికేనా...?" అనడిగేం.

"... యెక్కడికీ...?"

"... తెలీదా...?"

"ఆఁ ఆఁ తెల్సింతెల్సింది. ప్చ్, ప్చ్..." స్కూటర్ స్టాండువేసి, నిట్టూర్చేడు.

"...గురుడు, మోతాదు మించిపోయీవోడు. అదే హెల్త్‌ని దెబ్బగొట్టింది. మోతాదుగా వాడితే, మత్తు పదార్థం గూడా ఔషధమే..." పేథాలజిస్ట్‌గా హితవు చెప్పేడు.

హితవే! వినడానికి అతనేడీ? ఈ హితవు, యీ పేథాలజిస్టు గోవిందరావు, యిలాగే మోతాదు దాట కుండా గ్లాసు బోర్లించి, భాస్కర్‌కి చెప్పేవాడు.

"...ఔషధం కోసమే అయితే యిదెందుకోయ్. నీ లేబరేటరీకే వొచ్చీవోణ్ని..." అనేవాడు భాస్కర్...!

"ఒక గంటాగంటన్నరల బయల్దేర్తాంట. మనూ ర్లోనే అంత్యక్రియలు. ఫ్రెండ్సుందరం..." నర్సింగరావు మాట పూర్తికానేలేదు. గోవింద్ వోసారి నెత్తి గోక్కున్నాడు. చొక్కా జాడించుకుని యింట్లోకి వొకసారీ, స్కూటర్ని వోసారీ చూసి- యివన్నొదిలి రాలేనన్నాడు.

మాకు ఆశ్చర్యమేసింది. అంత్యక్రియలకి వెళ్దా మన్నాంగానీ భవబంధాలు తెంపుకొని 'అతని'తో వెళి పోదాం, రమ్మని పిలవలేదే! ఆశ్చర్యంగా చూసే మమ్మల్ని-

'...యేం బతుకిది? యేం బతుక'నడిగేడు.

మేము నెత్తులు గోక్కున్నాం.

"...గడియ తీరని బతుకు! పీల్చిన ఊపిరి, వొద ల్డానికి తీరదు. ఊపిరి బిగబట్టి, బతుకుతున్నాను. ఇదిగో, తెల్లారిందా, బయల్దేరానా? పదిగంటలకి కేజిహెచ్ డ్యూటీకి యెళ్లీలోపు- యివతల ఆ కార్పొరేట్ ఆస్పత్రి కెళ్లాల. అక్కడ కేసులుంటాయి. ఆటికి మత్తు యివ్వాల. అక్కడ్నించి ఆ తర్వాత, మా ఓన్ లేబరేట రుందా? అక్కడ కెళ్లాల, అక్కడ రిపోర్టులుంటాయి. ఆటికి సంతకాలెట్టి ఫైళ్లు రడీ జెయ్యాల. అప్పుడికి పది గంటల మీద మూడు ముళ్లూ ఆడ్తాయి. పరిగెట్టించాల బండిని కెజిహెచ్‌కి! ఊపిరి బిగబట్టి ఛస్తన్నాననుకోండి. ఇలాగ, ఛస్తేగాని- యిల్లూ, పిల్లాజెల్లాతో బతుకురథం సాగడానికి యింధనం చాల్దు..." అనన్నాడు.

సరే, మేమెళ్తామని చెప్పి కదిలేలోపు- గోవింద్రావు స్కూటర్ ఛస్తున్నట్టే శబ్దం చేస్తూ కదిలింది.

'సంపాదనా మత్తు గూడా, మోతాదు మించగూడ దోయ్- అనేవాడు!' భాస్కర్.

"సెల్‌కి చేస్తుంటే- కవరేజి యేరియాలో లేదో, స్పందించుటలేదో అంటోంది. చెప్పలేదేమర్రా, అన గల్డు. పదా, సత్తిరాజుకి చెప్పొద్దా,"మన్నాను.

*

సత్తిరాజు సిరిపురం జంక్షన్ దగ్గరుంటున్నాడు. రోడ్డు కిరువైపులా పెద్దపెద్ద భవంతులూ, షాపింగ్ కాంప్లెక్సులూ, కార్పొరేట్ ఆఫీసులూ, ఆసుపత్రులూ, అపార్ట్ మెంట్లూ- చూడ్డానికి కళ్లు పట్టడంలేదు. ఇవన్నీ యెప్పుడు లేచేయి? ఎంతలోన... యెంత మార్పు...?

త్రినాథ మేళాలోని బ్రాహ్మడికి వ్రతం పూర్తయే సరికి- పూరిపాక భవంతి అయిపోద్ది. దొంగలు తోలుకు పోయిన ఆవు తిరిగొచ్చేస్తది, దొడ్డిలోకి! తప్పిపోయిన కొడుకు దొరికిపోతాడు. అన్నీ క్షణాల్లో... జరిగిపోతాయి.

అలాగ- యెన్ని మేళాలూ, వ్రతాలూ జేసేరో- యీ భవంతుల బ్రాహ్మలు...?

"వీళ్లు- కులానికి బ్రాహ్మలు కారు. ధనానికి బ్రాహ్మలు! అసలు, వీళ్లు యీ ప్రాంతంవాళ్లే కారు. క్రిష్ణా, గోదారి జిల్లాల కమ్మలూ, ఇతర ప్రాంతాల రెడ్లూ, రాజులూ..." అనేవాడు భాస్కర్!

"...విశాఖపట్నం, బాగా యెదిగిపోయిందోయ్..." బండి నడుపుతూ నర్సింగరావు.

"ఆ ముక్క భాస్కర్ యెప్పుడో చెప్పేడు గదా? మన భీమసేనరావులూ, మందుల భీముళ్లూ- యిక సాల్రు. ఆళ్లకి మించినోళ్లు పవర్‌లో కొస్తారు! వంట సారాని- బ్రేందీ డామినేట్ జేసినట్టు- అనన్నాడు! అలగే అయ్యింది..." అని పరిణామాల యెరుకలో భాస్కర్ ఎంత కరెక్టో చెప్పేను.

"చుట్టుపక్కల ఊళ్లని ముంచీసీ, విశాఖపట్నంని సాగదీసేస్తన్నారోయ్... యెటు జూడూ, పట్నమే! ఇంత పట్నమూ- మనదిగాదు? ఎక్కడోళ్లదో- యీ సంపదా, సౌఖ్యవూ! మన భూభాగమ్మీద, యెవడో జెండా యెగ రెయ్యడమేటివోయ్? అపర్దిష్ట...! సీ," అంటూ బండి ఆపేడు నర్సింగరావు.

సత్తిరాజు ఇల్లొచ్చింది. బండి దిగి వెళ్లి కాలింగ్ బెల్ నొక్కేను.

తలుపు తెరుచుకొని, వొక పదహారేళ్ల పిల్ల తల- 'యెవులు కావాలండీ,' అనడిగింది. సత్తిరాజు... అనబో తుంటే, 'కేంపెళ్లారు, వొచ్చీస్తరు. గోదారికి దిగతా,' రన్చెప్పి, లోపలికి దూరిపోయింది తల.

ఏమీ పాలుపోలేదు. కాసేపలాగే నిల్చున్నాం.

మళ్లీ తలుపు తెరుచుకుంది. తలుపుకంటే వేగం గా, పందొమ్మిదీ, ఇరవై యేళ్ల అబ్బాయి, కాలేజీ బ్యాగు భుజాల్తో, కాన్వాస్ షూస్‌తో, బై మమ్మీ బైయ్యంటూ, మా ప్రక్క నుంచి దూసుకెళ్లేడు. ఆవరణలోని పల్సర్ మోటార్ సైకిలెక్కి స్టార్ట్ చేసి, ఆ యింటిగోడవైపు చూపి నట్లే మమ్మల్నీ చూసి, దూసుకుపోయేడు.

"...యెళ్లేదండీ...?" తలుపు మూతబడబోతూ, యిందాకటి తల ప్రశ్నించింది.

"...వెళిపోయేడు..." వీధిలోకి చూస్తూ చెప్పేం.

"...సినబాబు కాదు, మీరూ..." తలుపు మూసు కుంది.

చిరాకేసింది. వెళిపోదామని, యిద్దరమూ వెను దిరిగితే- పెరట్లోంచి గావోలు వొస్తోన్న సత్తిరాజు భార్య కన్పించింది. నిండార కురులు ఆరబోసి, చేతిలో హారతి పళ్లెంతో, తులసిమొక్క దగ్గరకు వొస్తూ మమ్మల్ని చూసింది. పలకరించి, హారతి కళ్లకద్దుకోమంది.

ఆమెకు భక్తెక్కువ. ఇహమ్మీద ప్రేమెక్కువ. ఎక్కువ భక్తితో భగవంతుణ్ణి ప్రార్థిస్తే ఇహలోకంలో సుఖంగా జీవించగలమన్న నమ్మకమెక్కువ. ఆ నమ్మకాన్ని భర్తయినా, పిల్లలయినా, బంధువులయినా బలపర్చాలి తప్పా, బలహీనపర్చగూడదు.

సత్తిరాజు- పెళ్లి కాకముందు నాస్తికుడు. పౌర హక్కుల నాయకుడు, మంచి నటుడు, మంచి వకీలు. పెళ్లయ్యేక, ఇద్దరు పిల్లలు పుట్టేక- వకీలుగా మాత్రమే

మిగిలేడు. పూజలో వున్నట్టుంది- పొద్దున్నే యింటికి వొచ్చి, ఇలాంటి వార్త చెప్తారా? మీ నాస్తికపు బుద్ధులెటు బోతాయి- అనయినా అనగల్దు- యేం జెయ్యడమా అని మేము తర్జనభర్జన పడుతుంటే-

''వాకిట్లో నిలబడిపోయేరు, ఇంట్లోకి రండి...'' అంటూ ఆమె లోనకి నడిచింది. మేము నిలబడిన చోట నుంచి కదలకుండానే-

''... పర్లేదమ్మా. సత్తిరాజుకోసమనీ...''

''ఇంటిలున్నోళికే దొరకడు, మీకింకేటి దొరుకు తాడు? సెల్‌కి చెయ్యలేకపోయేరా...?''

''చేశాం. కవరేజి ఏరియాలో...''

''వుండుండడు. ఉండినా పలకడు. బుద్ధులెటు పోతాయి...?''

హమ్మో...! మేం పోతామమ్మా... అన్నట్టు, వెను దిరిగేం.

అప్పుడడిగింది- ''పాపం, మీ అందరి ఫ్రెండు భాస్కర్రావుగారు పొద్దుటేనట గదా...?''

''...ఔనమ్మా. అంత్యక్రియలు అక్కడ మా ఊర్లో! సత్తిరాజు వస్తాడని...'' అన్నాను.

''...పొద్దుటే, యిలాగ కళ్లు తెరిసీ నిద్రలేస్తున్నాను, ఎవురో ఫోను...! నారాయణ, నారాయణ అని భగ వంతుడ్ని తల్చుకున్నాను. ఆ తరాత, అలాగే లేచి, స్నానం గీనం జేసి, పూజ జేసి, యిదిగో తులసిమొక్కకి మొక్కి యింట్లోకొస్తన్నాను. సూతకం కబురు గదా?'' అని వివరించింది.

మంచిదమ్మా- అనుకున్నాం.

''...పోన్లెండి. పుణ్యాత్ముడికి పుణ్యలోకాలు దక్కు తాయి! ఈ లోకంల, మానవుడు చాలా కష్టాలు పడ్డా డట గదా...! పోన్లెండి, పుణ్యలోకాలు దక్కుతా,''యనీ, విచారించొద్దనీ చెప్పింది. పుణ్యలోకాన్నీ, పుణ్యలోకం దక్కించుకున్నవాళ్లని చూసొచ్చినట్లు చెప్పింది. ఆమె పూజామహిమతోనైనా మావాడికి అవి దక్కాలిమరి అను కుంటుండగా- ఆటో ఆగింది. ఆటోలోంచి సత్తిరాజు దిగేడు. ఏవో ఫైళ్లూ, బ్రీఫ్‌కేసూ పట్టుకుంటూ వొచ్చి, మమ్మల్ని పలుకరిస్తూ- ''రండి, లోపలికి రండి బయటే నిలబడిపోయేరేం,'' అని ప్రశ్నిస్తూ, భార్యవేపు చూసేడు. విషయం చెప్పేం.

''హన్నన్నా...! జర్నీలున్నాను గదా, తెలీలే,''దని విచారించేడు. చేతిలోని ఫైళ్లూ, బ్రీఫ్‌కేసూ బరువన్పిం చాయో, తల పట్టుకు విచారించాలని అన్పించిందో- బరువుల్ని చూస్తూ, భార్యని చూసేడు! ఆమె చేతిలో హారతిపళ్లెం కన్పించింది.

చేతిలో బరువుల్ని అలాగే, ఆ గడపలో పడేసి, తల పట్టుకు విచారించి, ''అలాంటి మనిషి మనకి ఫ్రెండుగా మరి దొరకడు. అతనితో కొన్నాళ్లు కలిసి నాటకాల్లో నటించడం మన అదృష్టం- ఆ మహా నటుడు, దర్శకుడు, రచయితా ఆత్మకు శాంతి కలగా లని కోరుకుందాం,'' అన్నాడు. అంటే, అంత్యక్రియ లకు...?

''...నేను చచ్చినా, స్మశానం కెళ్లడానికి తీరుబడి లేదు. చూసేరుగదా? హైద్రాబాద్ నుండి యిప్పుడు గోదావరికి దిగేను. అర్జంటు బెయిల్ ఆర్డరు- కోర్టులో ప్రొడ్యూస్ చెయ్యాల. ఛ, నా వృత్తి అలాంటిది. చస్తన్నాను. తప్పదు, కాంపిటీషన్లో, నిలబడాలంటే, తప్ప,''దన్నాడు. చావడం తప్పదన్నట్టు! నిట్టూర్పుతో వెనుదిరిగేం. అప్పటికి, ఎండ కాస్తా ముదిరింది. రోడ్ల మీద రద్దీ పెరిగింది. సిరిపురం జంక్షన్ నుండి వస్తూ, జైల్ ఏరియా కొచ్చేం.

బండి స్లో జేస్తూ, జైలు ఏరియా చూపుతూ-

''...నాగ్గాని సొమ్ము వుంటే, యీ జైలు ఏరియాని కొనేద్దును. జైలుని పడగొట్టకుండా, అలాగే వుంచి ఆ జైలు గదులల్లో యెన్నెన్ని కలలు కాలిపోయాయో, యెన్నెన్ని బతుకులు కూలిపోయేయో, యెంతెంత నెత్తురూ, కన్నీరూ వొలికిందో తెలిపే వివరాల్తో ఒక ప్రదర్శనశాలగా తీర్చిదిద్దుదును. పర్యాటక మానవులకి, యిది చూసి జైలు అనే వొక వ్యవస్థ పట్ల యేహ్యాభావం కలిగేట్టు చేసేవాణ్ణి! అని అన్నాడువోయ్ భాస్కరోసారి. యీ జైలు కూల్చేసి, యింకొక్కాడ కొత్త జైలు కడ్తున్నా రని తెలిసి...'' చెప్పాడు నరసింగరావు.

చారిత్రక జైలు, ఆనవాలు గూడా లేకుండా- చదును జేస్సి, అమ్మకానికి సిద్ధం చేశారు! ఒక నిట్టూర్పు విడిచేను. భాస్కర్ డబ్బుంటే, యేమేం చెయ్యాలను కునేవాడో మిత్రులకు చెప్పేవాడు. అన్నీ పదిమందికీ పనికొచ్చేవే, కోరుకునేవాడు.

కానీ, భాస్కర్ యేమీ కొనలేకపోయేడు. 'డబ్బు' అనే పదార్థం అతని దగ్గర యెక్కువగా చేరేదికాదు. చేరినా యెక్కువ కాలం నిలిచేది కాదు. నిలవాలని, ఆశపడే వాడు కాదు.

ఔను, అతను హైదరాబాద్ వెళ్లేక, కొన్నాళ్లకి కొంత డబ్బు కూడగట్టేడు. దాన్ని జాగ్రత్తగా తీసుకొచ్చి, అలనాడు బాకీ కింద పోగొట్టుకున్న యింటిని కొనుక్కో డానికి ఖర్చు పెట్టేడు. ఆ సందర్భంగా మిత్రులందర్నీ ఊరు రప్పించి, తన యింట్లో సందడి జేసేడు.

''... ఆ డబ్బు పెట్టి, అక్కడే హైద్రాబాద్‌లోనో, లేదంటే యిక్కడ విశాఖలోనో ఇల్లో, ఇంటి స్థలమో కొనాల్సిందోయ్! ఈ పూర్వీకుల ఇల్లెందుక్కొన్నావ్?'' అని మిత్రుల్లో యెవరమో అడిగేం.

పెద్ద లోగిలి, ఆరేడు గదులు, విశాలమైన వరండా, గదుల మధ్య పెద్ద హాలు. పాలరాతి గచ్చులు. పెరడులో జామ, సపోటా, నారింజ, బొప్పాయి, పనస వంటి ఫలవృక్షాలూ, రకరకాల పూలమొక్కలూ... లోగిలంతా కలియదిరుగుతూ, భాస్కర్- ''... యీ యింట్లో మా తాత్తంద్రులూ, ముత్తాతలూ యెవరెవరో పుట్టీ, పెరిగేరు. వాళ్లంతా యేవేవో కలలు కని వుంటారు. తీరినవి తీరి వుంటాయి. తీరని వాటికోసమేవో తంటాలు పడుంటారు. ఏవేవో బంధాలూ, అనుబంధాలూ అల్లుకొనే వుంటారు. అల్లుకున్న వాటిలో కొన్నిటిని తెంపుకునీ వుంటారు. సరిగ్గా, ఈ లోకంలోకి వొచ్చిన ప్రతి మనిషీ, ఇదే పని చేసుంటాడు. కలలు గనటం, వాటికోసం తంటాలు పడటం, బంధాలు అల్లుకోడం, తెంపుకోడం- ఇంతే- మానవ జీవన సారమిదే! ఈ జీవనసారం నాకీ ఇంట్లో బోధపడింది. నా కలల జన్మస్థానమిది- అందుకే కొన్నానర్రా...'' అనన్నాడు.

అందరం ఆశ్చర్యపోయేం! అతనెప్పుడు మాటాడినా, వొక జీవిత సత్యమేదో యెరుకలోకొస్తుంది మనకు. మరి కొద్దినాళ్లకు, అటువంటి, అపురూపమైన ఇంటినీ వొక మిత్రుడు వైద్య అవసరాల కోసం అమ్మేశాడు!

''...కన్న కలను సాధించుకోవడమే గాదు, అవసరమైతే సాధించిన కలను ధ్వంసం చేసుకోగలగాలి...'' అనన్నాడు.

కలలూ, సాధనా, ధ్వంసం...! మిత్రమా, నిన్నందుకోలేమయ్యా- మనసు బాధగా మూలిగింది.

''... నేరుగా, బండి మీద ఊరెళిపోదాం! ఎలాగూ మన లేడీస్ రారుగదా? కావలిస్తే ఇళ్లకు ఫోన్ జేసి చెప్పేద్దాం...'' అనన్నాడు నర్సింగరావు. సరేనన్నాను.

మేము ఊరు చేరేసరికి, భాస్కర్ పార్థివదేహాన్ని అంత్యక్రియలకు సిద్ధం చేస్తున్నారు. ఊరు ఊరంతా అక్కడ కుప్పబోసిన శోకంలా కూర్చుంది. ఎవరో భాస్కర్ రాసిన, ప్రదర్శించిన నాటకాల్లోని ప్రసిద్ధమైన పాత్రల కేరికేచర్స్ తయారుజేసి, అక్కడ ప్రదర్శనకు పెట్టేరు. మరొకాయనెవరో భాస్కర్ చిత్రపటాన్ని, తన గుండె మీద కట్టుకొని, నిలువెత్తు దుఃఖంలా నిల్చున్నాడు. పూజ తంతు పూర్తయి, పార్థివదేహాన్ని పాడెమీద కెత్తారు. పాడె కదిలింది. గోవిందా... గోవిందా... గొంతులు పలికేయి... పాడె వెనుక నడుస్తున్న జనం.

నా ప్రక్కగా నడుస్తూ ఒకాయన, ''హుఁ... 'అతను' యీ పొద్దు చనిపోయేడు! మనం యెప్పుడో చనిపోయేం! ఏం బతుకులు మనవి...'' అనన్నాడు. తుళ్లిపడ్డాను.

*ఆదివారం వార్త, 21 జూన్ 2009*

